క్లుప్తంగా

పాణ్యంలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రజల్లో భరోసా కల్పించేందుకు మండల కేంద్రంలో పోలీసులు, ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఆదివారం ఎస్‌ఐ అశోక్ మాట్లాడుతూ పాణ్యంలో ప్రత్యేక బలగాలతో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా అన్ని రకాల భద్రతా పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని విజయానికేతన్ పాఠశాల విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటుకున్నట్లు డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షలో తమ పాఠశాలకు చెందిన దావీదు విక్టర్, అభిలాషిత, గౌతమ్‌తేజ, భరత్‌కుమార్ ప్రతిభ చాటారన్నారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



ప్రవచనం చెబుతున్న రఘునందన్ సేవక్ ప్రభు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరీథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్రలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. మానవ సంబంధాలు, ఉన్నత జీవనం సాగించేందుకు ఉపయోగ పడే అన్ని అంశాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు.ఇస్కాన్‌సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం



తాగునీటి ప్యాకెట్లు అందిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: సూర్య నారాయణ స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ శివరామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం గుత్తి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ట్రస్ట్ సభ్యులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో ఉచిత మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ నగేష్, డాక్టర్ కృష్ణమోహన్, భీమిశెట్టి ప్రకాష్, శ్రీదేవి, డాక్టర్ నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ వెంటే జనం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న సుభాష్

కర్నూలు (టౌన్) : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని, ఇందుకు జిల్లాలో మేమంతా సిద్ధం బస్సు యాత్రకు లభించిన విశేష స్పందనే ఓ ఉదాహరణ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోసు అన్నారు. ఆదివారం స్థానిక సి.క్యాంపులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిద్ధం బస్సు యాత్రకు లభిస్తున్న ప్రజా స్పందన చూస్తుంటే తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమికి ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఐదేళ్ల పాటు ప్రజా సంక్షేమ పాలన అందించిన జగన్నకు గత ఎన్నికల మాదిరిగానే ఈ సారి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు 2 పార్లమెంటు స్థానాలను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాడన్నారు. గత ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు.

బాబుకు... పెన్షనర్ల శాపం తగులుతుంది

ప్రతినెలా 1 వ తేదీన పెన్షన్ అందుకునే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు చంద్రబాబు నిర్వాకంతో ఈసారి సకాలంలో అందుకోలేని పరిస్థితి ఏర్పడిందని సుభాష్ అన్నారు. పెన్షన్‌దారుల శాపం చంద్రబాబుకు తప్పదన్నారు. పేదలంటే చంద్రబాబుకు ఎందుకో అంత కోపం అన్నారు. రెండు మూడు నెలలు నుంచి పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా ఆయన కుట్రలు పన్నుతున్నారన్నారు. ఇప్పుడు వలంటీర్లతో పెన్షన్ పంపిణీ జరగకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

- ప్రభుత్వం చేసిన మేలు మరువొద్దు
- ఓటుతో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఫ్యానుగుర్తుకు ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 34వ వార్డులోని కృష్ణారెడ్డి నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీకి ఒకటి, పార్లమెంట్ ఒకటి రెండు ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును గుర్తు చేసుకోవాలన్నారు. నవరత్నాల పథకాలను ఇంటి ముంగిటకు తెచ్చామన్నారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఇంటి సమీపంలోనే సమస్యలకు పరిష్కారం చూపాలని సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చామన్నారు.

రెట్టింపు సంక్షేమం

త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో విడుదల చేస్తారని, అందులో రెట్టింపు సంక్షేమానికి ప్రణాళిక చేశారని ఎమ్మెల్యే అన్నారు. మేలు చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటుకు వేసి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని కోరారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలసి ఉమ్మడిగా 600పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశాయని గుర్తు చేశారు. మళ్లీ మోసపోకుండా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన హుసేనాపురం టీడీపీ నాయకులు

పాణ్యంలో ప్రతిపక్ష పార్టీలు ఖాళీ

- టీడీపీ, జనసేన, బీజేపీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు: పాణ్యం నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలు ఖాళీ అవుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీలను వీడి వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. కల్లూరు అర్బన్‌లోని పందిపాడు, ముజఫర్‌నగర్, కల్లూరు, కల్లూరు ఎస్టేట్ ప్రాంతాలకు చెందిన టీడీపీ-70, జనసేన-50, బీజేపీ-30 కుటుంబాలు ఆదివారం ఆయా పార్టీలను వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. వైఎస్సార్‌సీపీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు భీమేష్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 32వ వార్డుకు చెందిన బీజేపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి, భవాని, షేక్షావలి, భాస్కర్, జహంగీర్, పరుశారామ్, రియాజ్, శ్రీను, వాలి, చక్రి, గోపాల్, మున్నాతో పాటు మొత్తంగా 150 కుటుంబాలకు చెందిన కార్యకర్తలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణా యాదవ్, ఆదినారాయణరెడ్డి, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హుసేనాపురంలో టీడీపీకి భారీ షాక్

ఓర్వకల్లు : మండలంలోని హుసేనాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన వాల్మీకి, కురువ, పక్కీర, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన దాదాపు 150 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఇందులో ప్రధానంగా గారపల్ల మద్దిలేటి, మేకల రవికుమార్, కాఫిపాడి మధు, చంద్ర మధుకుమార్, సద్దాం ఉసేన్, మహబూబ్‌ఖాన్, నూర్‌బాషా, అమీర్‌బాషా తదితర 150 మందికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సామాన్య పిల్లల కోసం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సమూల మార్పులకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, హుసేనాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు నాగతిరుపాలు, జీకే వెంగన్న, లోటర్‌బాషా, గోపా వెంకటరమణారెడ్డి, గోపా రామ్మోహన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



ఓబులం ప్రభాకర్‌రెడ్డికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాటసాని ఉమామహేశ్వరమ్మ



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని ఉమామహేశ్వరమ్మ

పాణ్యం: నియోజకవర్గంలోని ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అండగా ఉన్నారని, ఆయన చేసిన అభివృద్ధిని మరువొద్దని ఎమ్మెల్యే కాటసాని సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. ఆదివారం మద్దూరు, అనుపూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో నేడు అభివృద్ధికి బాటలు వేసిన ఎమ్మెల్యేకు అందరూ అండగా నిలబడి..మరోమారు గెలిపించాలని అభ్యర్థించారు. చెప్పిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలా నెరవేర్చారో... పాణ్యం నియోజకవర్గ ప్రజలకు కూడా ఎమ్మెల్యే నిత్యం అందుబాటులో ఉన్నారన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి

గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఓబులం ప్రభాకర్‌రెడ్డి, ఓబులం మహేశ్వరరెడ్డి, ఓబులం సరస్వతమ్మలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే సతీమని కాటసాని ఉమామహేశ్వరమ్మ సాదరంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మహీంద్రారెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలీల అడ్డాలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల్లో చలివేంద్రాలు, చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌డీ ఖాజా డిమాండ్ చేశారు. ఆదివారం సుర్జీత్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి కూలీలకు అడ్డాల్లో మంచినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అంతేకాక చలి పందిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ మూస, సయ్యద్, బాబు,జావీదు, అర్షద్‌బాష పాల్గొన్నారు.

పొలిటికల్ జేఏసీ నుంచి వైదొలుగుతున్నాం

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సీట్ల విషయంలో ఏర్పాటైన కురువ సంఘాల ఐక్యవేదిక (పొలిటికల్ జేఏసీ)నుంచి వైదొలగుతున్నట్లు జిల్లా కురువ సంఘం నేతలు ప్రకటించారు. ఆదివారం జరిగిన సమావేశంలో జేఏసీ వైస్ చైర్మన్ తొడు శ్రీనివాసులు మాట్లాడు తూ సీట్ల కేటాయింపు పూర్తి అయినందున జేఏసీ నుంచి కురువ సంఘం వైదొలుగుతోందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, సహాయ కార్యదర్శి కొత్తపల్లి దేవేంద్ర, పుల్లన్న, బీచుపల్లి, హరిదాసు, బీసీ తిరుపాలు పాల్గొన్నారు.

అన్నదాన శిబిరం ప్రారంభం



పెంచికలపాడులో అన్నదానం చేస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లే భక్తుల కోసం కోడుమూరులోని పర్రప్ప జిన్నులో ఎస్‌జీ.శంకర్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సతీష్ ఆదివారం ప్రారంచారు. వారు మాట్లాడుతూ ఏటా పాదయాత్ర భక్తులకు అన్నదానం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. అంతకుముందు వారు శిబిరంలో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాలకు పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ రఘునాథ్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, నాయకులు మల్లారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రవి, లింగమూర్తి పాల్గొన్నారు.

గూడూరు రూరల్: మండలంలోని పెంచికలపాడులో శ్రీశైలానికి కాలినడక వెళ్తున్న భక్తులకు స్థానికులు ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ఆదివారం ప్రారంభించారు. సర్పంచు లతమ్మ, సింగిల్ విండో చైర్మన్ ఎల్లారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ జేడీ పదవీ విరమణ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య ఆదివారం పదవీ విరమణ చేశారు. సాయంత్రం 5 గంటలకు కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసన్న బాబుకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. పదవీ విరమణ కారణంగా జేడీ పోస్టు ఖాళీ అవుతుండటంతో ఇది వరకే రెగ్యులర్ జేడీని ప్రభుత్వం నియమించింది. మండపేట శిక్షణ కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ జి.శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పించి జేడీగా నియమించారు. ఈయన ఈనెల 3వ తేదీ పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఘనంగా పునరుత్థాన వేడుకలు





ఓర్వకల్లులో మహిళను ఆశీర్వదిస్తున్న రె.ఫా.ఆనందరాజు, కొణిదేడులో రంగులు చల్లుకుంటున్న దృశ్యం

ఓర్వకల్లు: మరణంను జయించి తిరిగి లేచి ఏసుక్రీస్తు పునరుత్థానుడయ్యాడని పాస్టర్లు పేర్కొన్నారు. మరణం లేచి వచ్చిన రోజును పురస్కరించుకొని ఆదివారం పునరుత్థాన (ఈస్టర్) పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, శకునాల, బ్రాహ్మణపల్లె, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, పూడిచెర్ల గ్రామాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అలాగే ఈస్టర్ ప్రాశస్త్యాన్ని విశదీకరించారు. ఆర్‌సీఎం చర్చిలో ఓర్వకల్లు విచారణ గురువులు రె.ఫా.ఆనందరాజ్ భక్తుల కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేసి, బైబిల్ సందేశం వినిపించారు.

పాణ్యం: మండలంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఆయా గ్రామల్లోని తెల్లవారుజామున నుంచే పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఉదయం క్రైస్తవులు ఒకరిపైనొకరు రంగలు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.



సి.బెళగల్ ఏబీఎం చర్చిలో ఈస్టర్ ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. స్థానిక అమెరికన్ మాప్టీజం (ఏబీఎం) చర్చిలో పాస్టర్ సాలోమాను దేవుడి సందేశాన్ని వినిపించారు.

బాబూ..పేదలంటే ఎందుకంత వివక్ష?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్

కర్నూలు (సిటీ) : నిరుపేదలంటే అంత అసహనమా.. వారి పట్ల ఎందుకంత వివక్ష చూపుతున్నారు బాబూ.. మీ పార్టీలో పెత్తందారులకు మాత్రమే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చారు. మాది పేదల పార్టీ.. మా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ప్రాధాన్యతనిచ్చి వారిని చట్టసభలకు పంపడానికి కృషి చేస్తున్నారని..వారిని చులకన చేసి మాట్లాడటం దుర్మార్గమని కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ మండిపడ్డారు. శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును చంద్రబాబు నాయుడు అవహేళనగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

వలంటీర్ వ్యవస్థపై కుట్రలు..

వలంటీర్ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు సంక్షేమ పథకాలు ఠంచన్‌గా అందజేస్తుంటే ఇతర రాష్ట్రాలు అభినందిస్తున్నా.. చంద్రబాబు నాయుడు అక్కసు వెళ్లగక్కడం దారుణమన్నారు. నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుంటే కడుపు మంటతో రగిలిపోతున్నాడన్నారు. 'మీరు ఏరోజైనా పేదల కోసం పని చేశారా? మీ పాలనంతా పెత్తందారుల మేలు కోసమే శ్రమించారు.. అందుకే మిమ్మల్ని గత ఎన్నికల్లో ప్రజలు దూరం పెట్టారని, అయినా మీ తీరు మారలేదు. నిరుపేదలకు సకాలంలో పింఛన్లు ఇవ్వనీయకుండా వలంటీర్లను దూరం పెట్టాలని కొందరు ముసుగు వీరులతో కలిసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయించి వారిని పింఛన్ల పంపిణీకి దూరం చేయడం దుర్మార్గమన్నారు. మళ్లీ వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగాలనే ఇలా ప్రవర్తిస్తున్నారని, మానసిక వైద్యుడిని కలిసి చికిత్స పొందాల'ని సూచించారు. జెడ్పీటీసీ సభ్యులు మౌలాలి, ప్రసన్నకుమార్, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ్‌సింహారెడ్డి, పోలకల్లు ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు ప్రసాదు, రేమట సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

మంచి కొనసాగాలంటే జగనన్న మళ్లీ గెలవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న కోట్ల హర్ష, సతీష్

కోడుమూరు రూరల్: పేదల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, అవి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ గెలిపించుకోవలసిన ఆవశ్యకత మనందరిపై ఉందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని బుడగజంగాల కాలనీలో సంచార జాతులకు జగనన్న చేసిన మేలును వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. సంచార జాతుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, రవికుమార్‌రెడ్డి, కట్టెల శ్రీనివాసులు, గుజురి వెంకటస్వామి, బుడగజంగం కులస్తులు రవి, మాధవస్వామి, సుంకన్న, జంగాల రాముడు, తిమ్మప్ప, కార్తీక్ పాల్గొన్నారు.

వలంటీర్లపై కక్ష కట్టిన చంద్రబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- చంద్రబాబు నిర్వాకంతో పింఛన్‌దారులకు ఇబ్బందులు

కల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లపై కక్షకట్టారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్‌దారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. ప్రతి నెలా వారు గ్రామాల్లోని అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు పింఛన్ అందజేసేవారన్నారు. ఎన్నికల నియమావళి పేరుతో వలంటీర్లు పింఛన్లు, ఇతర నగదు ఇవ్వకూడదని చంద్రబాబు ఈసీకి తన అనుయాయులతో ఫిర్యాదు చేయించారన్నారు. దీంతో ఈసీ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించకూడదని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇదంతా చంద్రబాబు నిర్వాకంతోనే జరిగిందన్నారు. దీంతో పింఛన్‌దారులకు ఇబ్బందులు తప్పవన్నారు. చంద్రబాబు కుట్ర మరోసారి బయట పడ్డాయన్నారు. కరోనా మహమ్మారి ప్రబలడంతో ఒకరిని ఒకరు మాట్లాడుకోలేని, చూసుకోలేని సమయంలో వలంటీర్లు అన్ని తామై అందరి కోసం పని చేశారని గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే సామాజిక న్యాయం జరిగిందని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు టిప్పర్ డ్రైవర్‌కు అసెంబ్లీ సీటు ఎందుకని అవహేళనగా మాట్లాడడం రాష్ట్రంలో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వీరాంజనేయులుకు అవకాశం కల్పిండంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గతంలో ఎవరైనా ఎస్సీలలో పుట్టాలని కోరుకుంటారా? అని, బీసీల తోకలు కత్తిరిస్తాను అని అన్న మాటలను గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పార్టీలో, ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. విశ్వసనియత లేని వ్యక్తి చంద్రబాబు అని, బనగానపల్లె నియోజకవర్గంలో చెప్పినవి అన్ని అబద్ధాలు, అసత్యాలే అన్నారు. టీడీపీ నేతల ఆరోపణపై విలేకరులు ప్రశ్నించగా.. టీడీపీ నాయకులు తనపై చేస్తున్న భూకబ్జాల ఆరోపణల గురించి విచారించాలని, గతంలోనే జిల్లా ఉన్నతాధికారులు కలిశానన్నారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అవుట్ డేటెడ్ రాజకీయనాకుడని, ఆయన గురించి మాట్లాడడం సమయం వృథా అన్నారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ టీయూసి భీమేష్‌రెడ్డి, నాయకులు వీరయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ దేశభక్తుడు గామాగో



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: గామాగో నిస్వార్థ దేశభక్తుడు అని వక్తలు కొనియాడారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గామాగో ఆత్మకథ 'విస్మృత కార్యకర్త' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. సీపీఐ నాయకులు రామాంజనేయులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో గామాగో ఆత్మకథకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. బనగానపల్లె సంస్థాన స్వాతంత్ర్య పోరాటాన్ని ఇనాం భూముల రద్దు కోసం జరిగిన కరివేన సత్యాగ్రహాన్ని వివరంగా మొదటి సారి రికార్డు చేసిన పుస్తకం గామాగో ఆత్మకథ పుస్తకమన్నారు. గామాగో వ్యక్తిత్వం, ఆలోచన, నిజాయితీ, ఆచరణలో నిబద్ధత, ఉద్యమం ఎలా నడపాలో తదితర విషయాలు పుస్తకంలో ఉన్నాయన్నారు. తెలుగు భాషా వికాస ఉద్యమం జేఎస్ఆర్కే శర్మ, సాహితీ వేత్త జి.ఉమామహేశ్వర్‌లు పుస్తక సమీక్ష చేస్తూ రాజకీయ పాఠశాలలు నడపడం, అక్కడ తయారైన కార్యకర్తలను అత్యంత క్రియాశీలకంగా ప్రజా ఉద్యమాలు, సత్యాగ్రహాల్లో పాల్గొనేలా చేయడం గామాగో కార్యనిర్వహణ దీక్షకు అద్దం పడతాయన్నారు. గామాగో దేశానికి చేసిన సేవకు గౌరవంతో, అభిమానంతో ఆయన కుమార్తె ముక్కమల్ల ధరిత్రీదేవిని ఘనంగా సన్మానించారు. రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయితలు, కవులు రాయపాటి శ్రీనివాస్, జంధ్యాల రఘుబాబు, పుల్లా రామాంజనేయులు, డాక్టర్ దండబోయిన పార్వతీదేవి, నాగమణి, కల్యాణ దుర్గం స్వర్ణలత, సంగం స్వయంప్రభ, డాక్టర్ చంద్రమౌళిని, హరిసింహనాయుడు, డాక్టర్ చిన్నావుల రాజారెడ్డి, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, పాణ్యం నాగార్జున, గద్దం అమరనాథరెడ్డి, అరసం సభ్యులు రాణి లీలావతి, ప్రమోద్‌చక్రవర్తి, సయ్యద్ జహీర్ అహమ్మద్, రాజా రమేష్, రేవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీజేపీ కూటమిని ఓడించండి

కర్నూలు(సెంట్రల్): బీజేపీ, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన అభ్యర్థులను ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం నాయకులు మహ్మద్ షరీఫ్, పార్వతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఒకటో వార్డులో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డి.గౌస్‌దేశాయ్‌కు మద్దతుగా ఒకటో వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే 11వ వార్డులో పార్టీ జోన్ బాధ్యుడు పి.గోవిందు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.